కొలిక్కి వచ్చిన వివాదం

- కౌలుదారులకు చెక్
- ఈ నెల 4న అధికారులతో గిరిజన సొసైటీ సమావేశం
- 'సాక్షి' వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం


గిరిజన సొసైటీ భూముల్లో సాగవుతున్న జామాయిల్, చెరుకు పంట

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం రామగోవిందాపురం ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ బీ.గంగారం భూ వివాదం ఓ కొలిక్కి వచ్చింది. 'రగులుతున్న భూ వివాదం..', 'కౌలుదారుల కబంధ హస్తాల్లో..', 'నివురుగప్పిన నిప్పులా వివాదం..' శీర్షికలతో స్థానిక గిరిజనుల మధ్య జరుగుతున్న భూ వివాదాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురించింది. రెండు నెలల నుంచి జరుగుతున్న వాదప్రతివాదనలు, వాగ్వాదాలు, ఘర్షణలతో ఉద్రిక్త పరిస్థితులపై జిల్లా సహకార సంఘం దృష్టి సారించింది. రామగోవిందాపురం, గంగారం గిరిజనులకు మధ్య గత కొనేళ్లుగా సభ్యత్వాలపై వివాదం ఉంది. గంగారానికి చెందిన 16 కుటుంబాలకు సొసైటీ భూముల్లో హక్కులు లేవంటూ రామగోవిందాపురం గిరిజనులు వాదిస్తున్నారు. దీనిపై గంగారం గిరిజనులు, రామగోవిందాపురం గిరిజనులకు రాజీఫార్ములా కుదిర్చి ఆయా వర్గాలకు సొసైటీ సభ్యత్వం ఉండేలా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

కౌలుకు ఇవ్వకుండా..

30 ఏళ్లుగా 125 ఎకరాల సారవంతమైన భూములు కౌలుకు తీసుకుంటూ గిరిజనులను మోసం చేస్తున్న గిరిజనేతరులకు కౌలుకు ఇవ్వకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. గిరిజనేతరులేవ్వరు సొసైటీ భూములు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేయటం చట్టరీత్యా విరుద్ధమని వాటిని స్వాధీనం చేసుకొని సొసైటీకి చెందేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆ భూముల్లో పామాయిల్, చెరకు, మొక్కజొన్న, జామాయిల్ పంటలు సాగు చేస్తున్నారు. అధికారుల నిర్ణయంతో కౌలుకు తీసుకున్న వాళ్లకు చెక్ పెట్టినట్లైంది.

అంగీకారంతో..

జిల్లా సహకార సంఘం అధికారి గంగాధర్, కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు, గిరిజన సొసైటీకి చెందిన సభ్యులతో నవంబర్ 29న సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో సమావేశం జరిగింది. ఇక నుంచి గిరిజనుల మధ్య ఎటువంటి ఘర్షణలు జరగకుండా చర్యలు చేపట్టేలా ఓ అంగీకారానికి వచ్చారు. సొసైటీలో సభ్యత్వాల నమోదు, నూతన కమిటీ ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించి నూతన కమిటీ ఏర్పాటు అయ్యేవరకు జిల్లా సహకార సంఘం అధికారి పర్యవేక్షణలో సొసైటీ నిర్వాహణ జరిగేలా ఓ నిర్ణయానికి వచ్చారు. గిరిజనుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటే 144 సెక్షన్ ఏర్పాటు చేసి ఆ భూములకు ఎవరిని వెళ్లనీయకుండా చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. సొసైటీ భూముల్లో కోతలకు సిద్ధంగా ఉన్న చెరుకు పంటను కోయించి సొసైటీ ఖాతాలో వేసేలా నిర్ణయించారు.

4న గంగారంలో సమావేశం..

గిరిజన సొసైటీ సభ్యుల ఎన్నిక వివాదం, చెరుకు ఫ్యాక్టరీకి అమ్మి వచ్చిన డబ్బులను ఎలా భద్రపరచడానికి డీసీసీబీలో సేవింగ్ ఖాతా విషయంపై ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా సహకార సంఘం అధికారుల సమక్షంలో గంగారం రైతువేదికలో ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కో–ఆపరేటివ్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ రామిరెడ్డి తెలిపారు. సమావేశానికి సొసైటీకి సంబంధించి గిరిజనులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


సత్తుపల్లిరూరల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్/వేంసూరు: రాష్ట్రంపై ఎంత ఆర్థిక భారం ఉన్న రూ.2 లక్షల రుణమాఫీ, పంటలకు బోనస్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం సత్తుపల్లి మండలం గంగారం, కిష్టాపురం, సత్యంపేట, గౌరిగూడెం గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ప్రధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇన్ని అభివృద్ధి పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది నిజమైన పండుగ అని పేర్కొన్నారు. ఈ నెల 5న ఫుడ్‌పార్కు అభివృద్ధి పనులకు ఐదుగురు రాష్ట్ర మంత్రులు హాజరౌతున్నారని.. ప్రజలందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా వేంసూరు, మర్లపాడు, వెంకటపురం, లింగపాలెం గ్రామాల్లో రూ.2 కోట్లతో మంజురైన సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు, శ్రీనివాసరావు, శివవేణు, చెన్నకేశవరావు, కమల్‌పాషా, తహసీల్దార్ రాజు, సోమిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం..


కారేపల్లి–మాధారం రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: వైరా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పంతుల్‌నాయక్‌తండా, మొట్లగూడెం, రేలకాయలపల్లి, తవిసిబోడు, మాణిక్యారం, ఎర్రబోడు, కారేపల్లి, గేటుకారేపల్లి, సీతారాంపురం, కోమట్లగూడెం గ్రామ పంచాయతీలల్లో విస్తృతంగా పర్యటించి, సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం కారేపల్లి–మాధారం రోడ్డులో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు సుమారు రూ.6కోట్లతో 5కిలో మీటర్ల వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు కారేపల్లిలోని కొమరం భీం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, నాయకులు రామ్మూర్తి, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఐలయ్యయాదవ్, బోనీవీరప్రతాప్, దేవ్లానాయక్, శ్రీనివాసరావు, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీ.టీ. పోటీల్లో పతకాలు


విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ ప్రవీణ్

తల్లాడ: ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తల్లాడలోని బాలభారతి విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో ఆదివారం జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు కె.హాతేష్ శ్రీరంగా, ఈ.హరి, ఈ.తరుణ్, ఎం.జెప్పిన్ బాబు, ఎం.జెనీల్ బాబు, డి.ఉజ్వల, ఎస్.కే.జవేరియా వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని కేఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్ కె.శ్రావణి, ప్రిన్సిపాల్ టి.రామారావు, ఏఓ యాచమనేని శశాంక్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సత్తుపల్లిలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కరించేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజీకాదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మీరాఖాసీసాహెబ్, జూనియర్ సివిల్ జడ్జిలు ఆయేషాసరీన్, వడ్డె లావణ్య, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గోపాలరావు, న్యాయవాదులు, ఏఓ రవికుమార్ పాల్గొన్నారు.

ముదిగొండ ఎస్సైగా అనంతరాములు

ముదిగొండ: ముదిగొండ ఎస్సైగా అనంతరాములు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం సీపీ ఆఫీస్ నుంచి బదిలీపై ముదిగొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన ముదిగొండ సీఐ మురళిని మర్యాద పూర్వకంగా కలిశారు.

9 నుంచి చెరకు క్రషింగ్ నిలిపివేత

సత్తుపల్లి(కల్లూరు): కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ 2024–25 సంవత్సరం క్రషింగ్ సీజన్‌కు సంబంధించి ఈ నెల 9వ తేదీతో చెరకు క్రషింగ్ నిలిపి వేయడం జరుగుతుందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చళ్ళగుల్ల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా చెరకు నరకాల్సిన రైతులు వెంటనే అనుమతులు తీసుకుని చెరకు నరికించి ఫ్యాక్టరీకి తరలించి సహకరించాలని కోరారు.

తాగునీటి ఫిల్టర్ బెడ్లు పరిశీలన

సత్తుపల్లి(కల్లూరు): కల్లూరు పట్టణ పరిధిలోని ఎన్ఎస్‌పీ వద్ద ఉన్న ఫిల్టర్‌బెడ్లు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను సోమవారం మండల పంచాయతీ అధికారి ఏనుగు సురేష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. గేట్ వాల్వ్‌లు మరమ్మతులు, ట్యాంకులు శుభ్రపరచడం తదితర పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులు చేపట్టాలి

బోనకల్: బీబీసీ పరిధిలోని మైనర్ కాలువలు, వైరా ప్రాజెక్ట్ నుంచి గన్నవరం వెళ్లే కాలువకు మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఎం, సీపీఐ నాయకులు కోరారు. సోమవారం కాలువలను పరిశీలించి ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రాజెక్ట్ కాలువ కింద పంట పొలాలకు నీరందడం లేదని మరమ్మతే పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సురేష్, శ్రీను, ఆనందరావు, ప్రసాద్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మేర కులస్తుల వన సమారాధన

కొణిజర్ల: కొణిజర్ల మండల మేరు కులస్తులు సోమవారం వన సమారాధన నిర్వహించారు. పెద్దగోపతిలోని మామిడితోటలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, రాష్ట్ర మేర సంఘం నాయకుడు తాళ్ల వెంకటేశ్వరరావులు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు. మేరు కులస్తులంతా ఐక్యంగా ఉండి సమస్యల సాధనకు పోరాడాలన్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు బొడ్డు శిల్పిక, ఉపాధ్యక్షుడు కనకలింగేశ్వరరావు, రమేష్, అశోక్, భాస్కర్, చలపతిరావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి


చింతకాని: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

చింతకాని/తల్లాడ: కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ఎంఈఓలు డాక్టర్ అల్తాఫ్, రత్నమనోహర్ వైద్యసిబ్బందికి సూచించారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈనెల 15వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం మొత్తం 58 టీములు, 10 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. అదే విధంగా తల్లాడలోని పలు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పర్శ లేని మొద్దుబారిన మచ్చలు ఉంటే వారిని గుర్తించి చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తరలించాలని తెలిపారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ వీరేందర్, లెప్రసీ నోడల్ ఆఫీసర్ కృష్ణారావు, వైద్యాధికారిని సీష్మ, డీపీఎంఓ శాస్త్రి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ భాస్కర్, పెద్ద పుల్లయ్య, లక్ష్మీ, భద్రమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడల పోటీలు

ఎర్రుపాలెం: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండలకేంద్రంలోని రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి హెచ్ఎం అన్నవరపు దామోదరావు, ఉపాధ్యాయులు విజయ బహుమతులు అందించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


ధర్నా చేస్తున్న విద్యార్థులు

బోనకల్: స్థానిక రైతు వేదిక కార్యాలయం ఎదుట విద్యార్థులు బస్ సౌకర్యం కల్పించాలని ధర్నా నిర్వహించారు. బోనకల్ నుంచి లక్ష్మీపురం వరకు బస్ సౌకర్యం కల్పించాలని, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోవడంతో ధర్నాకు దిగామని విద్యార్థులు తెలిపారు. పాఠశాలలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ పున్నం చందర్ ఆర్టీసీ డీఎంతో మాట్లాడి మంగళవారం నుంచి బస్ సౌకర్యం కల్పిస్తామని హామి ఇచ్చారు.

తాగునీరు అందించాలి

ఏన్కూరు: ఇందిరా నగర్ కాలనీ వాసులకు తాగునీరు అందిచాలని ఆ కాలనీ వాసులు ఎంపీఓ వెంకటనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. గ్రామంలో గత 20 రోజులుగా మిషన్‌భగీరథ నీరు రావడం లేదని, ఈ విషయాన్ని అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఇందిరా నగర్ కాలనీ వాసులు రేపాకుల నర్సింహారావు, భూక్య లక్ష్మ, ప్రసాదు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేయాలి

ఏన్కూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి.. పత్తి కొనుగోలు చేయాలని గిరిజన సంఘాల ఐక్యవేదిక అనుబంధ సంఘం రైతు సంఘాల జిల్లా ఇన్‌చార్జ్ లాకావత్ నాగేశ్వారరవు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఎంసీ కార్యదర్శి బజార్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటా పత్తి రూ.13 వేలకు కొనుగోలు చేయాలన్నారు.

హామీలు అమలు చేయాలి

ముదిగొండ: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో.. కోలేటి ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర మండలం మల్లారంలో సీపీఎం మధిర డివిజన్ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు రమేష్, నాయకులు వరప్రసాద్, పురుషోత్తం, పద్మ, పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు ప్రారంభం

మధిర: మండలంలోని చిలుకూరు గ్రామ సమీపంలో ఉన్న కట్టలేరు నదిలో సోమవారం ఇసుక ర్యాంపును మండలస్థాయి అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిలుకూరు గ్రామ మాజీ సర్పంచ్ నిడమానూరి సంధ్యా వంశీ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఇసుక రేవును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఇసుక పంపిణీ పారదర్శకంగా ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై లక్ష్మి భార్గవి, ఈఓఆర్‌డీ శాస్త్రి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నరేంద్ర స్వామి ఆలయంలో పూజలు


నందినిని సన్మానిస్తున్న దృశ్యం

మధిర: మడుపల్లిలోని రాజరాజ నరేంద్ర స్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరికీ మంచి జరగాలని దేవుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా మధిర మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కోనా ధనికుమార్ ఆధ్వర్యంలో నందిని విక్రమార్కను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్, అనీల్ కుమార్ నెహ్రూ, నాగార్జున, గోపి, ఉద్దండయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక పూజలు

సత్తుపల్లిటౌన్: పాడ్యమి స్నానాలతో నెల రోజుల పాటు కార్తీక దీక్షలు ఆచరించిన భక్తులు విరమించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునే తలంటు స్నానాలు ఆచరించి అరటి దొప్పలపై దీపాలు వెలిగించి నీటిలో వదిలి పూజలు చేశారు.

వెంకటనారాయణకు సత్కారం


జేడీ వెంటనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గోపాలమిత్రలు

వైరా: ఖమ్మం జిల్లా పశుసంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ కె.వెంకటనారాయణను సోమవారం వైరా మండల గోపాలమిత్రలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గోపాలమిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వర్లు, కార్యదర్శి శేషగిరిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌లో చేరిక

మధిర: పీఆర్‌టీయూ మధిర మండల మాజీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ టీఎస్ యూటీఎఫ్‌లో చేరారు. మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో ఈనెల ఒకటిన జరిగిన మధిర మండల మహాసభ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు చేతుల మీదుగా రఫీ సభ్యత్వం తీసుకున్నారు.

సీఎం కప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కొణిజర్ల: ఈ నెల 7 నుంచి అన్ని స్థాయిల్లో ప్రారంభమయ్యే సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనేవారు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అయిత రోజారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో మొత్తం 36 క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారికి అర్హతలు, వయసు నిర్ధారణ తదితర వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరచబడి ఉన్నాయన్నారు.

'కేజీబీవీ'ల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు గానూ ఈనెల 3వ తేదీ నుంచి 4వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల సూపరిండెంట్ కె.సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఇంగ్లీష్, మాథ్స్ టీచర్ పోస్టులు, కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా అభ్యర్థినులు మాత్రమే దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. మార్కులు, అర్హతను బట్టి పోస్టు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

సింగరేణి కేజీబీవీలో..

కారేపల్లి: సింగరేణి కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల యందు పీజీసీఆర్‌టీ జూవాలజీ, పీఈటీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఆశక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ఎస్ఓ జాన్సీసౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 మార్చి వరకు గెస్టు ఫ్యాకల్టీగా జువాలజీ బోధించేందుకు ఎంఎస్‌సీ జూవాలజీ, బీఈడీ, పీఈటీ పోస్టుకు డిగ్రీతోపాటు, బీపీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

బస్వాపురం కేజీబీవీలో..

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం గ్రామంలో గల కేజీబీవీలో బయాలజీ బోధించుటకు కాంట్రాక్ట్ పద్ధతిపై సీఆర్‌టీ పోస్ట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ సౌజన్య ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 3, 4 తేదీల్లో జిరాక్స్ కాపీలతో నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రెండు రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వైరా/వైరారూరల్: ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రెండు రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం వైరాలోని తహసీల్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన అనంతరం తహసీల్దార్ కేవీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తాటిపూడి, గన్నవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయడం పట్ల రైతులకు రవాణా చార్జీలు పెరిగి అవస్థలు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా సోమవారం పూసలపాడు సొసైటీ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సొసైటీ సీఈఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం బాధ్యులు చలపతిరావు, శ్రీనివాసరావు, శరబంధి, రామారావు, చిన్న సత్యనారాయణ, సుధాకర్, నాగేశ్వరరావు, కృష్ణారావు, సంక్రాంతి నర్సయ్య పాల్గొన్నారు.


వైరా: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలాభిషేకం


కేంద్ర మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంలో సోమవారం కిషన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావుల కృషితో నియోజకవర్గంలో సిమెంట్‌రోడ్ల నిర్మానానికి రూ.20 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, మండల, పట్టణ అధ్యక్షులు ఆచంట నాగస్వామి, పాలకొల్లు శ్రీను, మట్టా ప్రసాద్, రహ్మతుల్లా, సుభాని, మాదిరాజు శ్రీనివాస్, నర్సింహామూర్తి, పమ్మి నర్సింహారావు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల మండల కమిటీ ఎన్నిక

సత్తుపల్లి(కల్లూరు): కల్లూరు మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంఘం ఎన్నిక సోమవారం జరిగింది. ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేములూరి నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మోదుగు రాంబాబు, కార్యదర్శిగా రాయల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బంకా వెంకట్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కల్లూరు పట్టణంలోని స్వాగ్ రెస్టారెంట్ మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ ఎన్నిక కార్యక్రమం అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ఆర్కే, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సంపత్, వెంకట్, మాజీ అధ్యక్షులు వెంకటేశ్వరరావువ, తిరుమలరావు, ఎమ్‌డీ హబీబ్, బీవీ, శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మూడో వారం వరకు మొక్కజొన్న సాగు చేయొచ్చు..

కొణిజర్ల: డిసెంబర్ 3వ వారం వరకు మొక్కజొన్న సాగు చేసుకోవచ్చని ఎంఈఓ డి.బాలాజి అన్నారు. సోమవారం మండలంలోని సింగరాయపాలెంలో మొక్కజొన్న విత్తనాలు పెట్టే విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది పత్తి వేసిన రైతులు సరైన దిగుబడి లేక ఇబ్బందులు పడ్డారన్నారు. మిర్చికి కూడా పెద్దగా ఆశించిన ఫలితాలు రాక పోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా యాసంగి మొక్కజొన్న సాగు వేపు చూస్తున్నారన్నారు. మండలంలో దాదాపు 16 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగుచేసే అవకాశం ఉందన్నారు. ప్రైవేట్ కంపెనీ సీడ్ మొక్కజొన్న వేసే రైతులు డిసెంబర్ 2వ వారం తర్వాత నాటొద్దన్నారు. కంపెనీ వారి నుంచి ధృవపత్రం తీసుకున్న తర్వాతే నాటుకోవాలన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఏన్కూరు: మండలంలో నెలకొన్ని సమస్యలను నెరవేర్చాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి నాగేశ్వరావు మాట్లాడుతూ.. మండలంలో ప్రధానంగా డ్రెయినేజీల సమస్య ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలాజీ, రాములు, లెనిన్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

కష్టపడితే ఫలితం సాధ్యమవుతుంది..

తల్లాడ: ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని డాన్‌బోస్కో సంస్థల హైదరాబాద్ ప్రావెన్షనల్ ఫాదర్ థామస్ సంతియాగో అన్నారు. సోమవారం మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన అబాకస్, వేదిక్ మాథ్స్, ఐఐటీ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. అనంతరం స్పెయిన్ దేశస్తులు, రోసియో, అల్బర్టో దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాన్‌బోస్కో పాఠశాల ప్రిన్సిపాల్ పాదర్ ప్రదీప్‌రెడ్డి, ఫాదర్లు జోసఫ్, రవి, సిస్టర్ కిరణ్ పాల్గొన్నారు.

వితరణలు వెల్లువ..

హిందీ లెక్చరర్ యోబు కుటుంబానికి.. రూ. 1.80 లక్షలు..

తల్లాడ: అనారోగ్యంతో మృతిచెందిన యోబు కుటుంబానికి తల్లాడ సూర్య జూనియర్ కళాశాల నిర్వహకులు లగడపాటి నెహ్రూ, మాధవి, పూర్వ విద్యార్థులు కలిసి రూ. 1.80లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ నగదును తల్లాడ యూనియన్ బ్యాంక్‌లో యోబు శ్రీమతి, ఇద్దరు ఆడపిల్లల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌లను యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. యోబు తల్లాడ జూనియర్ కళాశాలతో పాటుగా వివిధ కళాశాలల్లో పనిచేసారన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, పుల్లారావు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని ద్వారకాపురి కాలనీలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన బానోత్ జగన్, జాన్సీరాణి దంపతులు సోమవారం 'లక్ష పదకొండు వేల నూటపదహారు' రూపాలయలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, సోమిశెట్టి శ్రీధర్, ఉబ్బల వెంకటేశ్వరరావు, రాగాల చంద్రారెడ్డి, రాగాల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతగుడికి బీరువా..

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి (సంతగుడి) ఆలయానికి కారేపల్లికి చెందిన చిరునోముల రామారావు–హైమావతి దంపతులు రూ.15వేలు విలువ చేసే బీరువాను సోమవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య మాట్లాడుతూ.. ఆలయంలో స్వామి అలంకరణ ఆభరణాలు భద్రపరిచేందుకు బీరువా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈశ్వరశాస్త్రి, జూనియర్ అసిస్టెంట్ మూడ్ మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీబీవీకి క్రీడా సామగ్రి..

ఏన్కూరు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి ఖమ్మం నారాయణ, బసవమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు క్రీడా సామగ్రి సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచలన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శారద, కోటేశ్వరరావు పాల్గొన్నారు.